క్లుప్తంగా

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని 39వ డివిజన్‌లోని మదీనా మసీదు ఈద్గా ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో పశ్చిమ నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ అనంతరం ముస్లిం మత పెద్దలు, మైనారిటీ నాయకులను కలిసి ఆసిఫ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ రావాలని ఆకాంక్షించారు. మైనార్టీలందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ రాఘవ నరేంద్ర, మదీనా మజీద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి, సెక్రటరీ ఎస్‌డీ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ గాలి షాహిద్, కమిటీ సభ్యులు షేక్ సుభాని, షేక్ వసీం, షేక్ బాషా, షేక్ బషీర్ పాల్గొన్నారు

యాగశాల పనులు వేగవంతం కావాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ప్రాంగణంలో నిర్మిస్తున్న యాగశాల పనులను మరింత వేగవంతం చేయాలని ఈఓ కె.ఎస్. రామరావు ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై నటరాజ స్వామి ఆలయం సమీపంలో నిర్మిస్తున్న యాగశాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ పనులపై దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనులను నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నెలాఖరు నాటికి పనులు ఓ కొలిక్కి రావాలని స్పష్టంచేశారు. యాగశాలను త్వరలోనే ప్రారంభించి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. యాగశాల చుట్టు పక్కల పరిసరాలు కూడా అందంగా, ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. పూజా మండపాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. దుర్గగుడి స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యుడు రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద దక్షిణామూర్తికి ఈఓ కె.ఎస్.రామరావు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి దక్షిణం వైపు ప్రతిష్ఠించిన దక్షిణామూర్తి విగ్రహానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఈఓ పాల్గొన్నారు. దక్షిణామూర్తి దర్శనం, పూజతో కలిగే ఫలితాలను ఆలయ అర్చకులు వివరించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈఓ ఎన్. రమేష్‌బాబు, ఇతర ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గాయకుల్లో ప్రతిభను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకుల్లో ప్రతిభను ప్రోత్సహించాలని మహీస్వరాలు సాంస్కృతిక వేదిక అధ్యక్షురాలు మహేశ్వరి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ సంగీత విభావరి, ఏక గళ విభావరి గాయకుడు శేషగిరిరావుకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. మహేశ్వరి మాట్లాడుతూ.. గాయకులు తమకంటూ ప్రత్యేక బాణీని అలవర్చుకోవాలని సూచించారు. గాయకుడు శేషగిరిరావు, పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. నిర్వాహకులు శేషగిరిరావును ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు లక్ష్మి, అమృత వల్లి, మల్లీశ్వరి, పద్మశ్రీ, భాను సహస్ర, చింతకాయల చిట్టిబాబు, బి.వి.వీరభద్రరావు పాల్గొన్నారు.

నేడు బీసీల ఆత్మీయ సమావేశం

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం కార్యాలయం ప్రాంగణంలో బీసీల ఆత్మీయ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు జరుగుతుందని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బీసీ సంఘాల నాయకులు, బీసీ శ్రేణులు, కార్యకర్తలు హాజరు కావాలని కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు.

సర్వ మానవాళి శ్రేయస్సే ప్రధానం

- మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్
- చిట్టినగర్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు
- రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న షేక్ ఆసిఫ్





చిట్టినగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఇన్‌సెట్) రంజాన్ సందేశం అందిస్తున్న మోతీ మసీదు ఇమామ్ నజీర్ అహ్మద్



రంజాన్ సందేశాన్నిస్తున్న ఇమామ్ అబూ హురైరహ్ మదని

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సర్వ మానవాళి శ్రేయస్సే రంజాన్ లక్ష్యమని చిట్టినగర్ మోతీమసీదు ఇమామ్ నజీర్ అహ్మద్ అన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, తల్లిదండ్రులను గౌరవిస్తూ కుటుంబమంతా ఉమ్మడిగా కలిసిమెలిసి జీవించాలని, తోటి వారికి సాయం చేయడం, ఆకలితో ఉన్న వారి ఆకలిని తీర్చే శక్తిని ప్రతి ఒక్కరికీ ఆ అల్లా ప్రసాదిస్తారని ఉపదేశించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మోతీ మసీదు షాదీఖానా, ఈద్గా ఆవరణలో గురువారం ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలకు ముందు ప్రతి ఒక్కరూ ఏ విధంగా నడుచుకోవాలనే దానిపై ఖురాన్‌లో తెలిపిన విశేషాలను ఇమామ్ నజీర్ అహ్మద్ వివరించారు. ఖురాన్‌లో మానవుడి నడవడికకు సంబంధించి అనేక అంశాలు ఉన్నాయని, వాటిని ఆచరించినప్పుడే దేవుడి మార్గంలో నడిచినట్లని తెలిపారు. అనంతరం ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలను పురస్కరించుకుని మోతీ మసీదు కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. షామియానాలు, కూలర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఈద్గా ఆవరణలో మంచినీటి సదుపాయాన్ని కల్పించింది.

ముస్లింలకు ఆసిఫ్ శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ముస్లింలతో కలిసి ఈద్గా ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 రోజులు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ప్రతి ఒక్కరిపై అల్లా ఆశీస్సులు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలపై ఎంతో ఆప్యాయత చూపించడమే కాకుండా ముస్లింలకు పెద్ద పీట వేసి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. ముస్లింలకు వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్ ఇస్తే, వాటిని రద్దు చేస్తామని కొంత మంది భయాందోళనలకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి కుట్రలు చేస్తున్న ఉమ్మడి కూటమి అభ్యర్థులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్ యలకల చలపతిరావు, డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు విశ్వనాథరవి, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ మెహరాజ్, మాజీ కార్పొరేటర్ ఆవాల మారుతి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో ముస్లింలు నివసించే వించిపేట, తారాపేట, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో రంజాన్‌ను సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. ఇస్లాంపేటలోని మీనార్ మసీదు, తారాపేటలోని పెట్రోల్‌బంక్ వద్ద ఉన్న మసీదు, ఇందాద్‌ఘర్ వద్ద ఉన్న సరాయి మసీదు, కెనాల్‌రోడ్డులోని జామియా మసీదు, మొయిన్‌బజార్‌లోని పలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ముస్లింలు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు. వించిపేట షాహీమసీదు వద్ద ఇమామ్ ఖదీర్‌నయీమి రంజాన్ సందేశాన్ని అందించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ కార్పొరేటర్లు ఆర్షద్, యలకల చలపతిరావు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ తదితరులు నమాజ్‌లో పాల్గొన్నారు.

గాంధీజీ హైస్కూల్ ప్రాంగణంలో..

మార్కజ్ జామియా మసీదు అహ్లు ఆదీస్ ఆధ్వర్యంలో గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో గురువారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మసీదు ఇమామ్ అబూ హుర్రైరహ్ మదని రంజాన్ సందేశాన్ని అందించారు. రంజాన్ మాసంలోనే కాకుండా ఆ తరువాత సైతం ఆ నియమాలను పాటించి మానవులు అల్లా అనుగ్రహాన్ని పొందాలని కోరారు. ప్రార్థనల కమిటీ అధ్యక్షుడు యూసుఫ్ ఖాన్, కార్యదర్శి ఫారూఖ్ ఖాన్, మసీదు కార్యదర్శి రీజవానుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, సమానత్వాలే రంజాన్ సందేశం : ఆసిఫ్

సమాజంలో సమానత్వంతో పాటుగా మానవుల మధ్య ప్రేమ వర్ధిల్లాలని ఇస్లాం చెబుతోందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీ, వించిపేట తదితర ప్రాంతాల్లో జరిగిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అల్లా స్ఫూర్తితో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల మేలుకు విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి అందరూ పాటుపడాలని కోరారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయా మసీదులు, ప్రధానకూడళ్ల వద్ద బుధవారం రాత్రి నుంచి పోలీసు శాఖ ప్రత్యేక బందోబస్తు చేపట్టింది.



ముస్లింలకు రంజన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆసిఫ్



గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పార్టీలు మారటం పైలాకు అలవాటే

వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పోతిరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారడం పైలా సోమినాయుడుకు అలవాటేనని వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ నగర అధ్యక్షుడు పోతిరెడ్డి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి సమక్షంలో ఆ పార్టీలో గురువారం చేరిన సోమినాయుడికి పశ్చిమంలో ఓటే లేదని తెలిపారు. తొలుత కాంగ్రెస్, ఆ తరువాత ఎన్డీ తివారి కాంగ్రెస్‌లో చేరి విజయవాడ ఎంపీగా పోటీ చేసి ఘోరంగా ఓటమి పాలయ్యారని గుర్తుచేశారు. ఆ తరువాత మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరి లగడపాటి రాజగోపాల్ ద్వారా సిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యాడని, అనంతరం వైఎస్సార్ సీపీలో చేరి దుర్గగుడి చైర్మన్‌గా చేశారని, దాని కాలపరిమితి పూర్తయ్యాక గుంటూరు జిల్లా పెదకూరపాడు వైఎస్సార్ సీపీ పరిశీలకుడిగా ఉన్న విషయం ప్రజలందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఇంత చేసిన వైఎస్సార్ సీపీ తనను గుర్తించటం లేదని పైలా వాపోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవాచేశారు. గతంలో పైలా ఒక సారి, ఆయన భార్య ఒకసారి పశ్చిమ నియోజకవర్గంలో కార్పొరేటర్లుగా పోటీ చేసి పరాజయం పాలయ్యారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఓటమి తప్పదన్న నిరాశ, నిస్పృహలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పైలా సోమినాయుడు వంటి పార్టీ ఫిరాయింపుదారులను చేర్చుకోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ భవానీపురం ఫీడర్ లైన్ల మరమ్మతులలో భాగంగా శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని ఎంఐజీ-1 బ్లాకులు, స్వాతి థియేటర్ రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్, పోపూరి వారి వీధి, హనమయ్య వీధి, గుడివాడ రామారావు వీధి, ప్రసాద్ హోటల్ రోడ్, లత హాస్పిటల్ రోడ్, ఎంపీ దాస్ వీధి, ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్, చెట్ల బజార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పూలే స్ఫూర్తితో సీఎం జగన్ పాలన



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆసిఫ్ తదితరులు

- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్
- జ్యోతీరావు పూలెకు ఘనంగా నివాళులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త మహాత్మ జ్యోతీరావు పూలే ఆదర్శాలు, ఆశయ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషి చేసిన పూలే చిరస్మరణీయుడని పేర్కొన్నారు. జ్యోతీరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ ఆధ్వర్యాన విద్యాధరపురం బైపాస్ రోడ్‌లోని పార్టీ పశ్చిమ కార్యాలయంలో గురువారం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ.. మానవ హక్కుల కోసం పోరాడిన పూలే, భారతీయులందరూ ఒక్కటేనన్న సమ భావనతో కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించే వారని పేర్కొన్నారు. విద్య అనేది మానవుడికి జ్ఞాన జ్యోతి వంటిదని భావించిన పూలే ఆ దిశగా ప్రజలను చైతన్యవంతం చేసిన మహనీయుడన్నారు. పూలే సిద్ధాంతాలను ఆచరిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వెనుకబడిన అన్ని కులాలవారికి ప్రాధాన్యతనిస్తూ సామాజిక న్యాయం చేసిన సీఎం జగనన్న అభినవ పూలే అని అభివర్ణించారు. బీసీ నాయకులు మజ్జి శ్రీనివాసరావు, ఐతా కృష్ణకిషోర్, మాదాల తిరుపతిరావు, వానపల్లి త్రిమూర్తులు, ఏనుగుల సునీల్, మంజు భార్గవి, రాళ్లపల్లి లక్ష్మి, నాగ పావని, సముద్రాల లక్ష్మి, జీవమణి, సీహెచ్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐఐటీ, జేఈఈ అవగాహన సదస్సు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌తో పాటు ఐఐటీ, జేఈఈకి ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై శరత్‌చంద్ర ఐఐటీ అకాడమీ, శరత్‌చంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఎంజీరోడ్డులోని తమ అకాడమీలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఐఐటీ, జేఈఈకి ఎలా ప్రిపేర్అవ్వాలి, ఏ పుస్తకాలు చదవాలి, ఏటాపిక్స్ ఎక్కువగా ఫోకస్ చేయాలనే అంశాలపై ఆల్ ఇండియా ఆరో ర్యాంకు సాధించిన కార్తికేయ వివరిస్తారని, విద్యార్థులు సైతం సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకూ ఈ సదస్సు జరుగుతుందన్నారు.

శ్రీమద్రామాయణం నిత్యనూతన మహాకావ్యం



ప్రసంగిస్తున్న మండలీక శ్రీకృష్ణకుమార్

విజయవాడ కల్చరల్: శ్రీమద్రామాయణం నిత్యనూతన కావ్యమని ఆధ్యాత్మికవేత్త మండలీక శ్రీకృష్ణ కుమార్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీడీడీ కల్యాణ మండపంలో నిర్వహించే శ్రీమద్రామాయణ సప్తాహం వైభంగా కొనసాగుతోంది. గురువారం శ్రీ రాముడు ధర్మ స్వరూపుడు అంశంగా మండలీక శ్రీకృష్ణకుమార్ ప్రసంగించారు. శ్రీ మద్రామాయణ కథ కేవలం పురాణం కాదన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవం రామాయణంలో కనిపిస్తుందన్నారు. ఏ దేశానికైనా, ఏ ప్రాంతానికైనా, ఏ కాలానికైనా సమాజానికి అవసరమైన అంశాలు రామాయణంలో కనిపిస్తాయని వివరించారు. శ్రీరాముడి ఏక పత్నీవ్రతం, సత్యవాక్ పాలన, దుష్టశిక్షణ రామాయంలో కనిపిస్తాయని, ప్రజారంజక పాలనను రామరాజ్యంలో పోలుస్తారని పేర్కొన్నారు. నేటి సమాజానికి రామరాజ్యం అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అసిస్టెంట్ సి.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

పూలే ఆశయాలను సాధిస్తున్న సీఎం జగన్



జ్యోతీరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అయోధ్యరామిరెడ్డి,వెలంపల్లి, అవినాష్ తదితరులు

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజలకు ఉజ్వల భవిష్యత్తును ప్రసాదించేందుకు అనేక పోరాటాలు చేసి, ఆదర్శజీవితాన్ని గడిపిన గొప్ప సంఘ సంస్కర్త జ్యోతీరావు పూలే అని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి కొనియాడారు. ఆయన కన్న కలలను, ఆ మహనీయుని ఆశయాలను నిజం చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ కార్యాలయంలో మహాత్మా జ్యోతీరావు పూలే జయంతిని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అయోధ్యరామిరెడ్డి సెంట్రల్, తూర్పు, వెస్ట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు వెలంపల్లి శ్రీనివాసరావు, దేవినేని అవినాష్, షేక్ ఆసిఫ్‌తో కలిసి జ్యోతీరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు చదువుకుంటున్నారన్నా, అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నా, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నా దానికి ప్రధానకారకుడు జ్యోతీరావు పూలే అని గుర్తుచేశారు. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటాలు, ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. పూలే కన్న కలలను ఆచరణలో చేసి చూపుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. బీసీల అభ్యున్నతికి జగనన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు బోను రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు బీహెచ్ఎస్వీ జానారెడ్డి, బాలి గోవింద్, బీసీ నాయకులు లాకా వెంగళరావు యాదవ్, బోను దుర్గా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షపాతి శివరామకృష్ణ



శివరామకృష్ణ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పుణ్యశీల, వైఎస్సార్ సీపీ నాయకులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి మండవ శివరామకృష్ణ అని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, 34వ డివిజన్ కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల పేర్కొన్నారు. శివరామకృష్ణ ఏడో వర్ధంతి కార్యక్రమం గురువారం కేదారేశ్వరపేటలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పుణ్యశీల మాట్లాడుతూ.. ఏఐటీయూసీ జాతీయ నాయకుడిగా పనిచేసిన శివరామకృష్ణ కేదారేశ్వరపేటలో నాటి కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. 49వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయక కార్యదర్శి బుల్లా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేయడమే కాకుండా, స్థానిక ప్రజల సమస్యలపై పోరాడిన నాయకుడు శివరామకృష్ణ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాది శివ, బర్నా, మండవ శివ తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన నవ దుర్గ నృత్యరూపకం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో గురువారం సాయంత్రం కూచిపూడికి చెందిన చింతా రవి బాలకృష్ణ కళాబృందం ప్రదర్శించిన నవ దుర్గ నృత్యరూపకం భక్తులకు ఆకట్టుకుంది. దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ధర్మపథం వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మూడో రోజైన గురువారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ యువ పురస్కార్ గ్రహీత చింతా రవి బాలకృష్ణ బృందం ప్రదర్శించిన నృత్య రూపకాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కళాకారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో లయబద్ధంగా నృత్య రూపకాన్ని ప్రదర్శించగా, భక్తులు ఆద్యంతం ఆసక్తిగా వీక్షించారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఈఓ రామరావు వారిని సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

పొత్తు ధర్మానికి తూట్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో విభేదాలు తలెత్తాయి. మైలవరం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ తీరుపై జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలపై నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ)కి సమాచారం ఇవ్వకుండా కింది స్థాయి నాయకులకు సమాచారం ఇవ్వడంపై ఆ పార్టీ నేత చెరుకుమల్లి సురేష్ గురువారం తన ఫేస్‌బుక్‌లో ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోస్ట్ పెట్టారు. కొండపల్లిలో ఉండే ఇన్‌చార్జ్ గాంధీకి ఇక్కడ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వకపోతే ఇంకెక్కడి పొత్తుధర్మం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస సమాచారం ఇవ్వకపోవడంపై టీడీపీ నేత చుట్టుకుదురు శ్రీనివాస్‌పై ఫోన్‌లో విరుచుకుపడ్డారు. కాపు నాయకులు, కాపు ఓటర్లతో పనిలేదన్నట్లు వసంత కృష్ణప్రసాద్ వ్యవహారం ఉందన్నారు. ఇలా అయితే ఎన్నికల్లో టీడీపీకి సహకరించేది లేదని తెగేసి చెప్పారు.

13న నూతన సామాజిక భవనం ప్రారంభం

మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించిన నూతన సామాజిక భవనం ఈ నెల 13వ తేదీన ప్రారంభించనున్నట్లు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త పాలక మండలి చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు గురువారం తెలిపారు. మైలవరం, తిరువూరు రోడ్డు పక్కన దాతల సహకారంతో సుమారు రూ.20 లక్షలతో లయన్ సామాజిక భవనాన్ని ఆధునిక సౌకర్యాలతో నిర్మించారని తెలిపారు. మైలవరం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా వైశాఖి వేడుకలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): సిక్కులకు పవిత్రమైన వైశాఖి పర్వదిన వేడుకలు లబ్బీపేటలోని ఓ షాపింగ్ మాల్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన టర్బన్ అప్‌లో భాగంగా సిక్కుల మత ఆచారమైన తలపాగాను షాపింగ్ మాల్‌కి వచ్చిన సందర్శకులకు కట్టి పండుగ వేడుకలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. గ్లోబల్ సిక్కుల సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జ్ కరమ్ కౌర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గురుగోబింద్ సింగ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కుల్దీప్ కౌర్, కార్యదర్శి హరవిందర్ సింగ్ పాల్గొన్నారు. తెలుగు ప్రజలు ఉగాది పర్వదినం ఎంత పవిత్రమైనదో.. సిక్కులకు వైశాఖి పండుగ అంతే పవిత్రమైనదని ఈ సందర్భంగా వారు తెలిపారు.